పంచవటి కాలనీలో చైన్‌స్నాచింగ్

గచ్చిబౌలి: వాకింగ్ చేస్తున్న ఓ యువతి మెడలోని గోల్డ్ చైన్‌ను గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మణికొండలోని పంచవటి కాలనీ రోడ్ నెంబర్ 39లో వాకింగ్ ట్రాక్‌లో శుక్రవారం రాత్రి 8.14 గంటల సమయంలో వై.తేజస్విని(29) వాకింగ్ చేస్తోంది. వాకింగ్ ట్రాక్‌లోకి వచ్చిన గుర్తు తెలియని యువకుడు(22) తేజస్వినీ మెడలోని రెండు తులాల బంగారు గొలుసు లాక్కొని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదుతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు పరిసర ప్రాంతాలలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో వరల్డ్ ఫ్యామిలీ డాక్టర్స్ డే



వైద్యులను సన్మానిస్తున్న వృద్ధులు

హఫీజ్‌పేట్: వరల్డ్ ఫ్యామిలీ డాక్టర్స్ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఏపీఎఫ్‌పీ చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో న్యూట్రిషియన్ ఫర్ ద ఎల్డర్లీ అనే అంశంపై వృద్ధులకు ఎలాంటి పోషక ఆహారం అవసరంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూకె ఎఫ్ఆర్‌సీజీపీ డాక్టర్ కిరణ్మయి, తెలంగాణ రాష్ట్ర ఏఎఫ్‌పీఐ ప్రెసిడెంట్ ఫ్యామిలీ డాక్టర్స్ ఆవశ్యకత ఎంత ముఖ్యమో వారు వివరించారు. అనంతరం న్యూట్రిషన్ అండ్ డయాబెటిస్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ వసుంధర మాట్లాడుతూ ముఖ్యంగా షుగర్, రక్తపోటు ఉన్నవారు ఎలాంటి ఆహారం తీసుకోవాలో వివరించారు.కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజిని, వృద్ధులు పాల్గొన్నారు.

నాలాల పరిశీలన



ప్రేమ్‌నగర్‌లో నాలాను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, ఇంజనీరింగ్ అధికారులు

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ నాలాలను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, ఇంజనీరింగ్ అధికారులతో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలాల పూడికతీత, అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అపరిశుభ్రంగా వాకింగ్ ట్రాక్

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువుపై ఉన్న వాకింగ్ ట్రాక్‌పై చెత్తా చెదారం పేరుకుపోతోంది. చెట్లకొమ్మలు కూడా ట్రాక్‌ను ఆక్రమించటంతో వాకర్స్‌కు ఇబ్బందిగా ఉంది. చెత్త, దుమ్ము ఉండటంతో ఇబ్బందిపడుతున్నామని వాకర్స్ తెలిపారు. కనీసం ట్రాక్‌ను శుభ్రం చేయటం లేదని, రోడ్డు ఊడ్చిన చెత్తను కూడా ట్రాక్ పక్కనే పడవేస్తున్నారని తెలిపారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

కౌంటింగ్ విధానంపై అవగాహన



మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దేవుజా

పటాన్‌చెరు: పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌లకు కౌంటింగ్ విధానంపై పటాన్‌చెరు లోని ఎంపీపీ కార్యాలయంలో శనివారం అవగాహన కల్పించారు. కౌంటింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దేవుజా, తహశీల్దార్ రంగారావు, పటాన్‌చెరు నియోజకవర్గ ఎన్నికల మాస్టర్ ట్రైనర్ అమరేందర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సంతోష్,అధికారులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద వసతులు కల్పించాలని వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

హఫీజ్‌పేట్ : బక్రీద్ సమీపిస్తున్న క్రమంలో మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌లోని జామా మసీద్ ఈ నూర్ కబర్థాన్, ఈద్గాల వద్ద సౌకర్యాలు కల్పించాలని శనివారం ఎమ్మెల్యే గాంధీని కమిటీ సభ్యులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థనలు చేసుకోవడానికి వీలుగా అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, సయ్యద్ అహ్మద్, ఖాసీం, సలీం, షోయబ్, లుక్మన్, రషీద్, అంజాద్, పూర్ణ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేత



హఫీజ్‌పేట్ : చందానగర్ హుడా కాలనీలో లయన్స్ క్లబ్ హోప్ ఆధ్వర్యంలో శనివారం హుడా కాలనీకి చెందిన మహేశ్వరి కుటుంబానికి కుట్టుమిషన్ అందించారు. లయన్ సభ్యులు మహిపాల్‌రెడ్డి, శాంతిభూషణ్‌రెడ్డి మధుసూదన్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.



పార్కులో తుప్పపట్టి విరిగిపోయిన ఆట వస్తువులు



ఎఫ్‌సీఐ కాలనీలోని పార్కులో చెత్తా చెదారం





గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో వరద, మురుగు నీరు చేరిన దృశ్యం, కూలిన ప్రహరీ గోడ

పార్కుల నిర్వహణేదీ..?

చెత్తాచెదారంతో నిండిపోయిన ఎఫ్‌సీఐ పార్కు, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కు ● తుప్పపట్టిన పిల్లల ఆటవస్తువులు

మియాపూర్/ హఫీజ్‌పేట్: మియాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, వీడియో కాలనీ, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీల్లో పార్కులు నిరుపయోగంగా మారాయి. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో ఆహ్లాదం అందని ద్రాక్షగా మారింది. పలు ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేసిన జీహెచ్ఎంసీ ప్రస్తుతం ఈ పార్కుల విషయంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్కులను అభివృద్ధి చేయాలని అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదంటున్నారు స్థానికులు. పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు చెత్త, చెదారంతో నిండిపోయాయి.

- మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, వీడియో కాలనీల్లోని పార్కులు పచ్చదనం కరువై చెత్త, చెదారంతో దర్శనమిస్తున్నాయి. కొన్నేళ్లుగా పార్కులను పట్టించుకునే వారే లేరని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్‌సీఐ కాలనీ పార్కులో చెత్త, చెదారాన్ని తొలగించి పార్కులోనే ఓ పక్క వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.





- సర్వే నంబర్ 73,74లలో 23 ఎకరాల విస్తీర్ణంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇళ్లు నిర్మించుకున్నాయి. మౌలిక వసతుల కోసం రోడ్ల నిర్మాణంతో పాటు పార్కులకు ఖాళీ స్థలాలు కేటాయించారు. అప్పటి ఎమ్మెల్యేలు పి. జనార్దన్‌రెడ్డి, ఎం. భిక్షపతియాదవ్‌లు పార్కును అభివృద్ధి చేసి పార్కులో చిన్నారులకు కావాల్సిన ఆట వస్తువులు, కమ్యూనిటీ హాల్స్, బెంచీలు, లైట్స్ ఏర్పాట్లు చేశారు.
- ప్రస్తుతం పిల్లల ఆట వస్తువులు తుప్పుపట్టిపోవడంతో ఎప్పుడు విరిగి పోతాయోనని పిల్లలు, తల్లిదండ్రులు భయపడుతున్నారు. పిల్లలు ఆటలు ఆడడానికి వెనుకంజ వేస్తున్నారు.
- ఎఫ్‌సీఐ కాలనీ పార్కులో బోరు, కరెంట్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ బాక్స్‌లు మూతలు తెరుచుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. పిల్లలు ఎప్పుడు ప్రమాదాల బారిన పడతారోనని పిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.
- పార్కులను పట్టించుకోకపోవడంతో క్రిమికీటకాలు సంచరిస్తున్నాయ, రాత్రి వేళల్లో ఆకతాయిలు, మందు బాబులు పార్కుల్లోనే మద్యం సేవిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడిగా గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కు.. కూలిన ప్రహరీ

హఫీజ్‌పేట్ పరిధిలోని గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని పార్కు ఇటీవల కురిసిన వర్షానికి అస్తవ్యస్తంగా తయారైంది. వరద, మురుగునీటితో నిండింది. ఇటీవల కురిసిన వర్షాలకు పార్కులో వరద నీరు భారీగా చేరడంతో వాకింగ్ ట్రాక్ మునిగింది. ప్రహరీ గోడ కూలింది. గత ఏడాది జీహెచ్ఎంసీ అధికారులు లక్షలాది రూపాయలతో పార్కులో అభివృద్ధి పనులు ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు కేవలం వాకింగ్‌ట్రాక్‌తో పాటు పార్కును చదును చేశారు. కాలనీలో రెండు పార్కులుండగా ఒక పార్కును కాలనీవాసులు సొంత నిధులతో అభివృద్ధి చేసుకున్నారు. ఇక యూనిసెంట్ స్కూల్ పక్కనే ఉన్న పార్కు నిరుపయోగంగా ఉంది. కాగా వర్షాలకు ఈ పార్కులో వరదనీటితో పాటు మురుగు కూడా చేరింది. కొండాపూర్‌లోని మై హోం మంగళ నుంచి ప్రేమ్‌నగర్, మార్తాండనగర్‌ల నుంచి వస్తున్న మురుగునీరు ఈ పార్కు పక్క నుంచి వెళ్తుంది. వరదకు తోడు మురుగు కూడా పార్కులో చేరింది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.







చిత్తడిగా మారిన వాకింగ్ ట్రాక్

అధికారులు పట్టించుకోవాలి

గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో లింక్ రోడ్డును ఆనుకొని ఉన్న పార్కును జీహెచ్ఎంసీ అధికారులు అభివృద్ధి చేయాలి. కాలనీవాసులకు పార్కులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి. ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలి.

– శంకర్, కాలనీవాసి

పార్కు చిత్తడిగా మారుతోంది



చిన్నపాటి వర్షం పడితే చాలు పార్కు మొత్తం చిత్తడిగా మారుతోంది. ప్రహరీగోడ కూలిపోయింది.రానున్న వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని పార్కులో మొక్కలు నాటి మంచి వాతావరణం కల్పించాలి. అధికారులు చర్యలు తీసుకోవాలి. – మనోజ్, స్థానికుడు

అన్నమయ్యపురంలో నృత్యార్చన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీకృతి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ బృందం గురువు లలిత రమేష్ శిష్యబృందం కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఇందులో శుద్ధబ్రహ్మ, దేవదేవం భజే, తిరుతిరు జవరాల, జగడపు చలపుల తదితర కీర్తనలకు నృత్యం చేశారు. కళాకారులు శాన్వి, చిన్మయి, జాహ్నవి, అనూహ్య, నాగవరద, శ్రీసన్నిధి, అక్షిత, శివాన్షి, అనులేఖ, జోషిత, విద్య, కౌశిక దుర్గ, మణిదీప్త తదితరులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ శోభరాజు కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

శిల్పారామంలో అన్నమాచార్య జయంతి

శిల్పారామంలో శనివారం సాయిశృతి మ్యూజిక్ అకాడమీ వసుధామూర్తి తాళ్ళపాక అన్నమాచార్య జయంతిని ఘనంగా నిర్వహించారు. కీర్తనలకు నృత్యాభినయంతో అలరించారు. దాదాపు 90 మంది కళాకారులు పాల్గొన్నారు. టీవి నటులు పీవీ ప్రదీప్, టీవీ యాంకర్ సరస్వతి ప్రదీప్, నృత్యకళాకారిణి ఆశ్రిత వేముగంటి, మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ జ్యోస్యభట్ల తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.



ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట .. రూ.69 లక్షలు కాజేశారు

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.69 లక్షల 32 వేలు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.అమీన్‌పూర్ సీఐ నాగరాజు కథనం ప్రకారం...అమీన్‌పూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మార్చి 21వ తేదీ ట్రేడింగ్‌కు సంబంధించి ఒక మెసేజ్ వచ్చింది. దీంతో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. దీంతో నిర్వాహకులు ఒక ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు.దీంతో ఆ ఉద్యోగి నగదును ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తు వచ్చాడు. పెట్టిన నగదుతో పాటు, లాభాలు చూపించడంతో బాధితుడు పలు దఫాలుగా రూ.69 లక్షల 32 వేలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు రెట్టింపైన నగదు అంటే యాప్‌లో చూపించిన 2 కోట్లు ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్ట్‌టైం జాబ్ అంటూ..

పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన టెలిగ్రామ్ మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.3.29 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ తన టెలిగ్రామ్‌కు ఏప్రిల్ 13వ తేదీ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ. 3.29 లక్షలు చెల్లించాడు. వాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని 'నాన్ సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)' గురుకుల విద్యాలయాల్లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ ఏ శారద శనివారం తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 31వ తేదీ వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, వృత్తివిద్యా కోర్సుల్లో సీట్లు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు రుసుము ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పర్యటించారు.గోనెమ్మ బస్తీలో డ్రైనేజీ, రోడ్డు సమస్య ఉందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మూసాపేట: ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మూసాపేట డివిజన్ మాజీ అధ్యక్షుడు చున్నూ పాషా పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులోని రాయల్ ఫంక్షన్ హాలు వద్ద ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో షుగర్, థైరాయిడ్, సాధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరిసరాల శుభ్రతే లక్ష్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి, సిబ్బంది

రాయదుర్గం: కాలనీలు, బస్తీలలో పరిశుభ్రమైన వాతావరణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలి డివిజన్‌లోని జర్నలిస్ట్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, సోఫాకాలనీ, తాజ్‌నగర్ ప్రాంతాలలో చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించాలని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోనల్ కమిషనర్ స్నేహశబరీష్, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ఆదేశాలపై కాలనీలు, బస్తీలలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. పలుచోట్ల రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో కొందరు చెత్తను వేస్తున్నారని అలా వేయకుండా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రతికాలనీ, బస్తీలో చెత్త సేకరణకు రిక్షాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంట్లోనే కాకుండా పరిసరాల్లో, కాలనీ, బస్తీల్లో రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ రిసోర్స్‌పర్సన్ పద్మజ, రాంకీ సంస్థ ప్రతినిధులు, శానిటరీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ క్రాంతి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. శనివారం పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల, సంగారెడ్డి మండలం రాజంపేటలోని ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రాంగణాలలో చేపట్టిన పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మొదటి ప్రాధాన్యతగా మంచి నీటి సౌకర్యం, టాయిలెట్స్ మరమ్మతులు, విద్యుత్ తదితర పనులను చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యత తప్పనిసరి అని అన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు డీఈ రామ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ యాదగిరి, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, ఏంఈఓలు పీపీ రాథోడ్, పంచాయతీ కార్యదర్శి రిజ్వాన్, అధికారులు పాల్గొన్నారు.

పిల్లర్లకే పరిమితం..

మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణం



పిల్లర్ల దశలో ఆగిన భవన నిర్మాణం

శేరిలింగంపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం సామాన్య ప్రజలపాలిట శాపంగా మారింది. రెండేళ్లుగా మినీ ఫంక్షన్‌హాల్ నిలిచిపోయింది. లింగంపల్లి ప్రజలు చిన్నపాటి ఫంక్షన్లను చేసుకోవడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు మినీ కమ్యూనిటీహాల్ నిర్మించాలని నిర్ణయించారు. దీని నిర్మాణం కోసం రూ.25 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేశారు. నిధులు మంజూరవడంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. కాగా లింగంపల్లి విలేజ్‌లో ఎక్కువగా చిరుద్యోగులు, కార్మికులు అధికంగా ఉంటారు. ఫంక్షన్ హాళ్లకు భారీగా అద్దెలు కట్టలేమని మినీ ఫంక్షన్‌హాల్ ఉంటే ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. రెండేళ్లుగా ఎదురు చూపులకే పరిమితం అయింది. కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను రెండేళ్ల క్రితం ప్రారంభించారు. పిల్లర్లు స్థాయిలో పనులు ఆగిపోయాయి.



లింగంపల్లివిలేజ్‌లో మినీ కమ్యూనిటీహాల్ కోసం తేదీ లేకుండా రెండేళ్ల కితం వేసిన శిలాఫలకం

పనులు పూర్తయ్యేలా చర్యలు

లింగంపల్లి కమ్యూనిటీహాల్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్ జాప్యం వల్లే ఆలస్యం జరిగింది. త్వరితగతిన పనులు ప్రారంభించి, భవనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం.

– సునీల్, ఏఈ, జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్